క్లుప్తంగా

సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో వేంచేసియున్న నాగుల గుడి దేవాలయంలో ఆదివారం సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి కల్యాణం జరిగి 16 రోజులు అయిన సందర్భంగా విశేషంగా వసంత కార్యక్రమం, పవళింపు సేవా కార్యక్రమం, హారతులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

వైభవంగా శారదామాత జయంతి

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో శ్రీ రామకృష్ణ సేవా మండలిలో ఆదివారం శారదామాత జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు గండికోట విజయ్‌కుమార్ శర్మ నేతృత్వంలో శారదామాతకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి అనంతరం భక్తులకు ప్రసాదాలను, మిఠాయిలను పంపిణీ చేశారు. సేవా మండలి అధ్యక్షులు గుంటక కాశిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఫైనాన్స్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక



పిడుగురాళ్ల: పట్టణంలోని పల్నాడు ఫైనాన్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్ష ఎన్నిక కార్యక్రమం చేపట్టారు. పల్నాడు ఫైనాన్స్ అసోసియేషన్ పిడుగురాళ్ల అధ్యక్షుడిగా జూలకంటి సురేష్‌కుమార్‌ను పిడుగురాళ్ల ఫైనాన్స్ అసోసియేషన్ సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే గౌరవాధ్యక్షులుగా కాటా వెంకటేశ్వర్లు, జి.సాంబశివరావు, వైస్ ప్రెసిడెంట్‌గా సురేష్, కోశాధికారిగా కొనకొండ్ల జ్ఞానేశ్వరరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన వారిని పాత అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

విజయపురిసౌత్: స్థానిక శివ గణేష్ హోటల్ వెనుక ప్రదేశంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు విజయపురిసౌత్ ఎస్‌ఐ షేక్ మహమ్మద్ షఫీ ఆదివారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ పోలీస్ సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేసి రూ.3,580 నగదును స్వాధీన పరచుకొని నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులను మాచర్ల కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కార్యాలయం మార్పు తప్పదా..?!

- కూటమి నేతల ఒత్తిడితో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మార్పు
- పలు భవనాలు పరిశీలనలో అధికారులు
- అయోమయంలో ప్రజలు



ప్రస్తుతం గురజాలలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

గురజాల : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మార్పు జరగాల్సిందేనని కూటమి నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఎన్నికల సమయంలో కారంపూడి రోడ్డులోని కార్యాలయాన్ని పల్లెగుంత రోడ్డుకు తీసుకువచ్చారని వెంటనే ఆ ప్రాంతం నుంచి ఖాళీ చేసి బయటకు రావాలని జిల్లా స్థాయి అధికారులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న భవనంలో అన్ని సదుపాయాలతో ఎవరికి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలతో, సకల హంగులతో కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకుడి భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉండటమేంటని కూటమి నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారం మాది మేము చేప్పినట్లు వినాల్సిందేనని హుకూం జారీ చేస్తున్నారు.

పలు భవనాల పరిశీలన

కార్యాలయం మార్పుపై జిల్లా అధికారులకు ఒత్తిడి రావడంతో శనివారం హుటాహుటిన పల్నాడు జిల్లా రిజిస్ట్రార్ రామ్‌కుమార్ గురజాల కార్యాలయానికి వచ్చి ఆఫీసు మార్పుపై రిజిస్ట్రార్ స్రవంతికి పలు ఆదేశాలు జారీ చేశారు. కారంపూడి రోడ్డులోని సచివాలయంతో పాటు పంచాయతీ రాజ్ గెస్టు హౌస్‌ను జిల్లా రిజిస్ట్రార్ పరిశీలించారు. కక్షిదారులకు అనుకూలంగా ఉండే భవనం చూడాలని తప్పనిసరిగా కార్యాలయం మార్పు జరగాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

అయోమయంలో ప్రజలు

రిజిస్ట్రార్ కార్యాలయం సంవత్సరానికి ఒకసారి మార్పు జరుగుతుండటంతో రిజిస్ట్రేషన్ కోసం వచ్చే అయోమయంలో పడుతున్నారు. మార్చి నెలలో కారంపూడి రోడ్డు నుంచి పల్లెగుంత రోడ్డుకు మార్పు చేశారు. అప్పటి నుంచి నేటి వరకు కూడా చాలా మందికి కార్యాలయం మార్పు జరిగినట్లు తెలియలేదు. కారంపూడి రోడ్డులో కార్యాలయం ఉందనే ఆలోచనతో అటు వైపుగా వెళ్తునే వున్నారు. కార్యాలయం మార్పు జరిగిన విషయాన్ని తెలుసుకుని పల్లెగుంత రోడ్డులోని కార్యాలయానికి వస్తున్నారు. 10 నెలలకే మరలా కార్యాలయం మార్పు అంటే ప్రజలు ఇబ్బందులకు గురవుతారని పలువురు అంటున్నారు.

పలు సమస్యలకు అవకాశం

కార్యాలయం మార్పు జరిగితే దానికి అనుసంధానమైన రైటర్లకు గదుల ఏర్పాటుతో పాటు కక్షిదారుల వాహనాలకు అనువైన పార్కింగ్ స్థలం తదితర వసతులు వంటివి కుదరకపోవచ్చని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అన్ని వసతులు కలిగిన భవనం స్థిరంగా ఒకే ప్రాంతంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా మాజీ సీఎం జగన్ పుట్టినరోజు వేడుకలు



మాజీ సీఎం జగన్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి తినిపించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలలో వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు

పిడుగురాళ్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం రాత్రి మండలంలోని కరాలపాడు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ గ్రామంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేశారు. కేక్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు ఒకరికొకరు తినిపించుకున్నారు. నంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, గ్రామ సర్పంచ్ చల్లా శివారెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చింతా సుబ్బారెడ్డి, నబ్బూరి పుల్లారెడ్డి, జానీబాషా, జాని, శ్రీనివాస రెడ్డి, వీరారెడ్డి, మద్దసాని రమణారెడ్డి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెల్దుర్తిలో...

వెల్దుర్తి: విద్య, ఉద్యోగం, రైతు భరోసా, సచివాలయాల నిర్మాణం వంటి వినూత్న పథకాలతో ప్రజల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మండలంలోని శ్రీరాంపురం తండాలో మేరాజోత్ ఈశ్వరిబాయి ఆధ్వర్యంలో శనివారం రాత్రి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మాజీ సీఎం జగన్ ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించారని, అదే విధంగా ప్రజలందరికీ అధికారులను చేరువ చేసి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా వార్డు, గ్రామ సచివాలయాలు వంటివి ఏర్పాటు చేశారన్నారు. ఎవ్వరూ ఇవ్వని విధంగా ప్రతి ఒక్కరికి కులం, మతం, ప్రాంతం, పార్టీ అనే తేడా లేకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా సంక్షేమం అందించిన గొప్ప లీడర్ జగనన్న అని గర్వంగా చెప్పవచ్చన్నారు. కేవలం కొందరి స్వార్థం వల్లనే వైఎస్సార్‌సీపీ నాయకులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ప్రజల అభివృద్ధిని కోరుకున్న జగన్‌ను ప్రజలు ఎన్నటికీ మరువలేరన్నారు. ఈ కార్యక్రమంలో మేరాజోత్ అంజని కుమార్ నాయక్, పోకూరి చిన్న లక్ష్మణాచారి, ఎం.శివానాయక్, ఎం.స్వతంత్ర నాయక్, పాత్లావత్ బాలయ్య నాయక్, కళావత్ వెంకటేశ్వర్లు నాయక్, పోకూరి అశోక్, లక్ష్మి బాయి, లలిత బాయి, పార్వతి బాయి, హనిమి బాయి, రాజేశ్వరి, ఈశ్వరి తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



రెంటాలలోని శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవస్వామి



రెంటచింతలలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి

రెంటచింతల: ధనుర్మాసం సందర్భంగా మండలంలోని స్థానిక రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో, రెంటాలలోని శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో, తుమ్మకోట గ్రామంలోని జనార్ధన స్వామి ఆలయంలో ఆదివారం వేకువ జాము నుంచి భక్తిశ్రద్ధలతో ధనుర్మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి 6 గంటల వరకు నిర్వహించిన ఈ పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఎంతో పవిత్రమైన ధనుర్మాసంలో గోదాదేవికి విశేష పూజలు నిర్వహించడం సంప్రదాయం. ఆయా గ్రామాలలోని ఆలయ పరిసర ప్రాంతాలలో వేకువజాము నుంచి గోవింద నామస్మరణ మార్మోగింది. స్వామి వార్లు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

వార్డుల్లో పర్యటించిన చైర్మన్



మాచర్ల: పట్టణంలోని గుడ్ మార్నింగ్ మాచర్ల కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు 18, 13 వార్డులలో పర్యటించి వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య పనులు, కరెంటు స్తంభాలు కొత్తగా వేయడం తదితర సమస్యలను పలువురు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాల జారీ చేసి పనులు చేయించారు.

మండల స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్

పిడుగురాళ్ల : పిడుగురాళ్ల మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ జనవరి 3వ తేదీన ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు షేక్ జానీ, సన్ని ఆదివారం తెలిపారు. కన్నెగంటి భార్గవ్ నాయకుడు జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించటం జరుగుతుందన్నారు. మొదటి బహుమతి రూ.22,222, రెండవ బహుమతి రూ.17,777, మూడవ బహుమతి రూ.12,222తో పాటు షీల్డ్‌లను అందజేయనున్నారు. క్రీడాకారులు రూ.149తో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. టీమ్ కెప్టెన్ ఎంట్రీ కోసం రూ.1,999 చెల్లించాలన్నారు. ఈ క్రికెట్ పోటీల కోసం ఈ నెల 25వ తేదీ ఆక్షన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రికెట్ టోర్నమెంట్ జనవరి 3వ తేదీన ప్రారంభం అవుతుందన్నారు. క్రికెట్ ఆటగాళ్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరన్ని వివరాల కోసం 9502300411, 8522999880 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ పిడుగురాళ్ల పట్టణంలోని స్కాలర్స్ డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు పనులు కొనసాగింపు



కొనసాగుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులు

అచ్చంపేట: మాదిపాడు నుంచి జడపల్లి తండా, కంచుబోడు తండాలను కలుపుతూ పులిచింతల ప్రాజెక్టు ఘాట్ రోడ్డు వరకు సుమారు 6 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులు వేగం పుంచుకున్నాయి. మాదిపాడు నుంచి కంచుబోడు తండా, జడపల్లి తండా వరకు పక్కా రోడ్డు వేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.3.50కోట్లు నా బార్డు నిధులు మంజూరు అయిన విషయం తెలిసిందే. అప్పటి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు రోడ్డు నిర్మాణానికి మాదిపాడు వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించి, కొంతమేర గ్రావెల్, డస్ట్‌తో రోడ్డు వేశారు. ఇంతలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పనులు ఆగిపోయాయి. ఆగిపోయిన రోడ్డు నిర్మాణ పనులను అధికారులు తిరిగి వేగవంతంగా కొనసాగించడం పట్ల తండా వాసులు, స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రోడ్డుకు గ్రావెల్, డస్ట్ వేసి, తారువేస్తున్నారు. మరో పది పదిహేను రోజుల్లో పూర్తి కావచ్చు. కంచుబోడు తండా, జడపల్లి తండాల వద్ద ఉన్న లో లెవల్ చప్టా పనులను కూడా ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

సత్ప్రవర్తనతో మెలిగే భక్తులకు క్రీస్తు దీవెనలు

విచారణ గురువులు జోసెఫ్ బాలసాగర్



సాగర్‌మాత ఆలయ ప్రాంగణంలో తేరు ప్రదక్షిణలో భక్తులు



ప్రసంగిస్తున్న పాస్టర్ మోజెస్

విజయపురిసౌత్: విశ్వాసంతో క్రీస్తును ఆరాధిస్తూ సత్ప్రవర్తనతో మెలిగే భక్తులకు క్రీస్తు దీవెనలు తప్పకుండా ఉంటాయని సాగరమాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసెఫ్ బాలసాగర్ ఉద్బోధించారు. విజయపురిసౌత్‌లోని పుణ్యక్షేత్రమైన సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆలయ విచారణ గురువులు జోసెఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో దివ్యబలి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం నిర్వహించిన తేరు ప్రదక్షిణలో భక్తులు భారీగా పాల్గొన్నారు. దీనికి ముందు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం వద్ద సందడి నెలకొంది.

క్రీస్తుని స్తుతించటమే నిజమైన క్రిస్మస్

దాచేపల్లి : క్రీస్తుని స్తుతించటమే నిజమైన క్రిస్మస్ అని హైదరాబాద్‌కి చెందిన పాస్టర్ డాక్టర్ గొల్లపల్లి మోజెస్ అన్నారు. ఇరికేపల్లి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సెమీ క్రిస్మస్ సందర్భంగా కేక్‌ని స్థానిక సంఘ కాపరి రెవ. తగరం ప్రేమయ్యతో కలిసి పాస్టర్ మోజెస్ కట్ చేసి ప్రత్యేక ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ మోజెస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితాలు సంతోషంగా ఉండాలంటే పూర్ణ హృదయంతో క్రీస్తుని ఆరాధించాలన్నారు. క్రీస్తుని ఆరాధించిన వారి జీవితాలు ఆనందమయంగా ఉంటాయని చెప్పారు. విశ్వాసంలో సడలిపోకుండా క్రీస్తు రాకడని కనిపెట్టుకుని జీవించాలని, క్రీస్తు ద్వారానే పరలోకరాజ్య మోక్షం లభిస్తుందని పాస్టర్ మోజెస్ అన్నారు. సండేస్కూల్ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. క్రీస్తు పుట్టుక నాటకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు నాగెండ్ల రత్నం, నాగెండ్ల ఏసయ్య, నాగెండ్ల యాకోబు, మాతంగి రాంబాబు, పత్రా రమేష్, పత్రా ఆనందరావు, నాగెండ్ల మధుసూధన్‌రావు తదితరులు పాల్గొన్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



మాచర్ల: పవర్ ఫౌండేషన్ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, న్యాయవాది జి.జె.రావు ఆధ్వర్యంలో మాచర్ల పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్రాంగణంలో వృద్ధులు, దివ్యాంగులు నిరాశ్రయులైన 100 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు జి.జె.రావు మాట్లాడుతూ నిరాశ్రయులైన ప్రతి ఒక్కరికి మన పవర్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో సాయం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ గురజాల అప్పారావు చారి, పెరుమాళ్ళ మునెయ్య, భీమవరపు శ్రీనివాసరావు, వై.సాంబశివరావు, రత్నారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చిన సర్పంచ్



రాజుపాలెం: మాచర్ల-గుంటూరు రహదారికి ఇరువైపులా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ గుంతల వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నెల 13న గుంతలు పూడ్చండి-ప్రాణాలు కాపాడండి శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. మానవతా దృక్పథంతో స్పందించిన రాజుపాలెం సర్పంచ్ పులిబండ్ల అశోక్ ఆదివారం తన ప్రొక్లెయినర్‌తో రాజుపాలెం-రెడ్డిగూడెం మధ్య రోడ్డు గుంతలను పూడ్చారు. వాహనదారులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

వివాహిత మహిళ ఆచూకీ లభ్యం

రెంటచింతల : వివాహిత మహిళ అదృశ్యం కేసు మిస్టరీ వీడింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం రెంటచింతల మండలం మంచికల్లు గ్రామానికి చెందిన సునీత అనే వివాహిత మహిళ ఈ నెల 18వ తేదీన బ్యాంకుకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీనిపై ఆమె భర్త పిచ్చయ్య స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ నాగార్జున కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా వీరికి నాలుగు నెలల క్రితం వివాహం అయిందని తెలిపారు. మహిళ తెనాలిలో ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు వెళ్లి తీసుకువచ్చి తల్లిదండ్రులకు ఆదివారం అప్పగించారు.

స్వామియే.. శరణం అయ్యప్ప

- 18 కొండల మధ్య వెలసిన అయ్యప్ప స్వామి
- సముద్ర మట్టానికి 3 వేల అడుగుల ఎత్తులో ఆలయం
- ఏటా శబరిమలకు 5 కోట్ల మంది భక్తులు

అయ్యప్ప నామస్మరణతో పులకిస్తున్న గ్రామాలు



జెట్టిపాలెంలో విశేషంగా ఆకట్టుకున్న అయ్యప్ప పడిపూజ మండపం (ఫైల్)



ప్రత్యేకంగా ద్రాక్షపళ్లతో ఏర్పాటు చేసిన శివ లింగాకారం (ఫైల్)



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న గురుస్వామి గుంటుపల్లి అంతోని వరప్రసాద్ (ఫైల్)

రెంటచింతల: మణికంఠుడిగా పేరు పొందిన అయ్యప్పస్వామి కేరళ రాష్ట్రంలోని శబరిమల హిందువులకు ఓ ప్రధాన పుణ్య క్షేత్రంగా విరాజిల్లుతోంది. పల్లె, పట్టణ ప్రాంతాలలో ప్రతి ఏటా నవంబర్ 15 నుంచి జనవరి 20 వరకు హరిహర సుతుడు అయ్యప్ప నామస్మరణతో పులకించిపోతుంది. సాక్షాత్తు జ్యోతిస్వరూపుడు అయ్యప్ప మహిషి అనే రాక్షసిని సంహరించి శబరిమలలో వెలిశాడని పురాణాల ద్వారా తెలుస్తుంది. భక్తులు అయ్యప్ప మాల ధరించి వారి వారి ప్రాంతాలలో పడిపూజ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తుంటారు. పడిపూజలో అయ్యప్ప స్వామికి 21 రకాల అభిషేకాలతో పాటు వివిధ రకాల పూజలు చేస్తారు. ప్రతి ఏటా సుమారు 5 కోట్ల మంది భక్తులు అయ్యప్పస్వామిని దర్శించుకుంటారు. మండల పూజకు వెళ్లే వారు కార్తిక మాసంలో, మకర జ్యోతి దర్శనానికి వెళ్లే వారు మార్గశిర మాసంలో మాలధారణ చేసి 41 రోజుల పాటు నియమ నిష్టలతో పూజలు చేసి అనంతరం శబరిమల వెళ్లి స్వామిని దర్శించుకుంటారు. దక్షిణ భారతదేశంలోని ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలో అధికంగా అయ్యప్ప మాలధారణ స్వీకరిస్తారు. ద్వారపూడిలో నిర్మించిన అయ్యప్ప ఆలయం ఆంధ్ర శబరిమలగా పేరు పొందింది. ఈ ఆలయాన్ని శబరిమలలో మాదిరి నిర్మించడం విశేషం.

ఇరుముడి ఇలా...

41 రెజుల దీక్ష అనంతరం స్వామికి సమర్పింపచడానికి ఇరుముడి కట్టుకుని మాలధారులు బయలుదేరుతారు. ఇరుముడి అంటే రెండు ముడులున్నది అని అర్థం. ఒక ముడిలో నేతితో నింపిన కొబ్బరి కాయ, రెండవ ముడిలో పూజ సామగ్రి కొబ్బరికాయలు, వక్కలు, తమలపాకులు, నాణేలు, పసుపు, కుంకుమ, గంధం పొడి, విభూతి, పన్నీరు, బియ్యం, అటుకులు, మరమరాలు, బెల్లం, అరటిపళ్ళు, కలకండ, అగరువత్తులు, కర్పూరం, మిరియాలు(వావర్ దర్గాకోసం), తేనె, ఎండు ద్రాక్ష, తువ్వాలు వంటి వస్తువులను ప్రతి అయ్యప్ప మాలధారుడు ఇరుముడిగా కట్టుకుంటారు. ఈ వస్తువులను ఇరుముడిగా కట్టుకునే ఉత్సవాన్ని పల్లికట్టు అంటారు.

- కేరళలోని పత్తినంతిట్ట జిల్లాలో పశ్చిమ కనుమల్లో సహ్యాద్రి పర్వతశ్రేణుల ప్రాంతంలో సముద్ర మట్టానికి సుమారు 3 వేల అడుగుల ఎత్తులో దట్టమైన అడవిలో 18 కొండల మధ్య శబరిమల ఆలయం ఉంది. ప్రతి ఏటా నవంబర్ 15 నుంచి డిసెంబర్ 26 వరకు ఆలయం తలుపులు తెరచి ఉంచుతారు. 27, 28, 29, మూడు రోజులు ఆలయం తలుపులు మూసి తిరిగి డిసెంబర్ 30 నుంచి జనవరి 20 వరకు మాలధారులు స్వామివారి దర్శనం చేసుకునేందుకు తెరచి ఉంచుతారు.
- దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి నేరుగా రోడ్డు మార్గం ఉంది. ఏ ప్రాంతం నుంచి వచ్చిన పంబ దగ్గర నుంచి ప్రతి భక్తుడు ఇరుముడితో స్వామి వారి దర్శనానికి దట్టమైన అడవుల మధ్య సుమారు 7 కి.మీ. కాలినడకన వెళ్లాలి. దీనికి మరో మార్గం వండి పెరియార్ నుంచి పులిమేడు కొండ మీదుగా 17 కి.మీ. నడచి వెళ్లాలి. ఈ మార్గంలో పులులు, అడవి జంతువులు ఎక్కువగా సంచరిస్తుంటాయి. దీంతో ఈ మార్గం నుంచి తక్కువ మంది భక్తులు స్వామి దర్శనానికి వెళ్తారు.

పడిపూజ నిర్వహించడం అదృష్టం



అయ్యప్ప స్వాములతో పాటు వివిధ మాలలు ధరించిన వందలాది మంది భక్తులు పాల్గొనే పడిపూజ మహోత్సవం నిర్వహించడం స్వామి వారు నాకు ఇచ్చిన అదృష్టంగా భావిస్తున్నాను. అరటి బోదెలు, 18 మెట్లతో ఏర్పాటు చేసిన అయ్యప్ప మండపం వద్ద శరణం శరణం అయ్యప్ప...స్వామి శరణం అయ్యప్ప అంటూ స్వాములు చేసే అయ్యప్ప నామస్మరణతో ఆ ప్రాంతమంతా పులకించి పునీతమవుతుంది. 34 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా అయ్యప్ప మాల ధరిస్తున్నాను.

–బద్దూరి బ్రహ్మానంద రెడ్డి, గురుస్వామి, రెంటచింతల

177 సార్లు అగ్ని గుండ ప్రవేశం చేశా



రెంటచింతల ఆంజనేయస్వామి మాణ్యం కాలనీలో 30 సంవత్సరాలగా అయ్యప్పస్వామి పడిపూజ ఏర్పాటు చేస్తున్నాను. 41 సంవత్సరాలుగా అయ్యప్ప మాల స్వీకరించి 177 సార్లు అగ్ని గుండంలో నడిచాను. శబరిమలలోని సన్నిధానంలో పావనవట్టంపై శివలింగాన్ని తలపిస్తూ అయ్యప్పస్వామి కూర్చుని భక్తులకు దర్శనమివ్వడం ఓ అద్భుతం. అయ్యప్ప దీక్ష తీసుకున్న భక్తులకు మండల పూజ నవంబర్ 17, మకర విళక్కు జనవరి 14 శబరిమల యాత్రలో ప్రధాన ఘట్టాలు.

– గుంటుపల్లి అంతోని వరప్రసాద్, గురుస్వామి, రెంటచింతల

హెల్మెట్ తప్పనిసరి

ముప్పాళ్ళ: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై యు.సోమేశ్వరరావు తెలిపారు. సత్తెనపల్లి-నరసరావుపేట రోడ్డులోని పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. లైసెన్స్ లేకుండా వాహనం నడపటం నేరమని, తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలని సూచించారు. ఏఎస్సై మాధవరావు, నవరాజు, సిబ్బంది పాల్గొన్నారు.